RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

పూలే ఆశయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 83 | ఏప్రిల్ 12 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 83 | April 12 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


# తెలంగాణ ఇంటర్ ఫలితాల విడుదల

**ఏప్రిల్ 12న ఉదయం 11 గంటలకు**




**హైదరాబాద్, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:**
తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ (ప్రథమ, ద్వితీయ సంవత్సరాల) పరీక్ష ఫలితాలు ఏప్రిల్ 12, 2026న విడుదల కానున్నాయి. బోర్డు అధికారుల ప్రకటన మేరకు, ఉదయం 11 గంటలకు ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ ఏడాది సుమారు 10

➤ మిగతా 2వ పేజిలో..

# దక్షిణాది రాష్ట్రాల ఉనికిని ప్రశ్నార్థకం

- నియోజకవర్గాల పునర్విభజన తీరుతో నష్టం :
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:**
కులగణన చేపట్టామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఆ గణాంకాలను పరిగణనలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికికే ముప్పు వాటిల్లుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హెచ్చరించారు. రవీంద్ర భారతిలో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన, కేంద్రం అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలను ఎండగట్టారు. 2011 నాటి జనాభా లెక్కల ప్రాతిపదికన విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడే ప్రమాదం ఉందని, తద్వారా సమాజంలో బలహీన వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

దక్షిణాది రాష్ట్రాలు సామాజిక మార్పునకు నాంది పలుకుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచుతుంటే, వాటిని బలహీన పరిచేందుకు కేంద్రం పన్నుల వాటాలో కోత విధిస్తోందని భట్టి విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లే ప్రతి రూపాయిలో తిరిగి వస్తున్నది కేవలం 37 పైసలు మాత్రమేనని, తమిళనాడుకు 29, కేరళకు 61 పైసలు అందుతుండగా, ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్‌కు 6.53 రూపాయలు, ఉత్తరప్రదేశ్‌కు 2.17 రూపాయలు అందుతున్నాయని గణాంకాలతో

➤ మిగతా 2వ పేజిలో..

# గద్దెల నిర్మాణంలో అవినీతి జరగలేదు

- అవినీతి ఆరోపణలను ఖండించిన మంత్రి సీతక్క



**ములుగు, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:** మేడారం సమ్మక్క-సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎటువంటి అవినీతి జరగలేదని రాష్ట్ర మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ములుగు పర్యటనకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికిన అనంతరం, కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనపై, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. మేడారం గద్దెల పునర్నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న వారు, దమ్ముంటే అందుకు సంబంధించిన ఆధారాలను చూపించాలని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు

➤ మిగతా 2వ పేజిలో..

# హోర్ముజ్ జలసంధిని దాటిన భారత నౌక 'జగ్ విక్రమ్'

## గల్ఫ్ మార్గంలో సాధారణ స్థితివైపు అడుగులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో, భారతీయ నౌకల రాకపోకలకు మార్గం సుగమమైంది. ఈ ఒప్పందం తర్వాత తొలిసారిగా ఒక భారతీయ రిజిస్టర్డ్ నౌక 'జగ్ విక్రమ్' హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ (ప్రొ+) సరకుతో ముంబైకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందిన ఈ మధ్యస్థాయి నౌక, శుక్రవారం రాత్రి జలసంధిని దాటి శనివారం మధ్యాహ్నం నాటికి హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌక మరికొద్ది రోజుల్లోనే భారత్‌కు చేరుకోనుంది. మార్చి నెల నుండి ఇప్పటివరకు హోర్ముజ్ జలసంధిని దాటిన

➤ మిగతా 2వ పేజిలో..

## తెలుగు రాష్ట్రాల్లో ఐటీడీఏల

# బలోపేతంపై కేంద్రం సమీక్ష

- గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల పనితీరును మెరుగుపరిచేందుకు, వాటిని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఒకరోజు కార్యశాలను నిర్వహించింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో, గిరిజన సాంస్కృతిక-శిక్షణా సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల పాల్గొని రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మరియు ఐటీడీఏ అధికారులకు స్వాగతం పలికారు. ఈ కార్యశాలలో ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, నిధుల వినియోగం, మరియు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై సుదీర్ఘంగా చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, జీవనోపాధి కల్పన మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

➤ మిగతా 2వ పేజిలో..

# ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ ప్రతినిధుల కీలక చర్చలు

- ట్రంప్ తీవ్ర హెచ్చరికలు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11 జనసంఘర్షణ:**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్న తరుణంలో, ఈ చర్చలు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

➤ మిగతా 2వ పేజిలో..

# అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో ట్రంప్ వ్యూహం

- చమురు ఎగుమతులపై ప్రపంచ దేశాలకు పిలుపు

**వాషింగ్టన్/ఇస్లామాబాద్, ఏప్రిల్ 11 జనసంఘర్షణ**
ఇరాన్‌తో శాంతి చర్చలు ప్రారంభం కావడానికి ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చమురు ఎగుమతులపై కీలక ప్రకటన చేశారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన చమురు, గ్యాస్ తమ వద్ద అందుబాటులో ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసేందుకు ప్రపంచ దేశాలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రష్యా, సౌదీ అరేబియా వంటి ప్రధాన చమురు ఆర్థిక వ్యవస్థల కంటే అమెరికా వద్దే అత్యధిక నిల్వలు ఉన్నాయని పేర్కొన్న ట్రంప్, అమెరికా తీరానికి వస్తున్న చమురు ట్యాంకర్ల కోసం తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రపంచంలో ఏ ప్రాంతానికైనా ఇంధనాన్ని ఎగుమతి చేసేందుకు సిద్ధమని ప్రకటించడం ద్వారా, ఇంధన మార్కెట్లో తన పట్టును చాటుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు, ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య జరగాల్సిన చర్చలు ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఇస్లామాబాద్ చేరుకుని నాలుగు గంటలు దాటినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో నేరుగా చర్చలు ఇంకా మొదలుకాలేదు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారులు పాకిస్థాన్ ప్రతినిధులతో సంప్రదింపులు

➤ మిగతా 2వ పేజిలో..

# దక్షిణాది రాష్ట్రాల ఉనికిని ప్రశ్నార్థకం

**మొదటిపేజీ తరువాయి..** వివరించారు. ఈ వివక్షపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోనూ చర్చ జరిగిందని, నియోజకవర్గాల పునర్విభజనలో కుల గణనను పరిగణనలోకి తీసుకోకుంటే దేశవ్యాప్త పోరాటం తప్పదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ప్రజలకు నిధులు కేటాయిస్తుంటే, ఓర్వలేని ఫ్యూడల్ శక్తులు తిరిగి ఏకమయ్యే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే ద్వారా తెలంగాణలో 56 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. అలాగే, బీసీ సబ్ ప్లాన్ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. మహాత్మా పూలే ఆశయాలకు అనుగుణంగా అందరు వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని, విద్యార్థుల ఆహారం, వసతి విషయంలో అత్యంత పారదర్శకత పాటిస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రభుత్వం నిటారుగా నిలబడుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# గద్దెల నిర్మాణంలో అవినీతి జరగలేదు

**మొదటిపేజీ తరువాయి..** కూడా సిద్ధమేనని ప్రకటించారు. అంగన్‌వాడీ టీచర్లకు సరఫరా చేసిన సెల్‌ఫోన్ల కొనుగోలు విషయంలోనూ మంత్రి వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని తెలిపారు. రూ.11,650 విలువ చేసే ఫోన్లను రూ.14,000గా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది దురుద్దేశపూర్వకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు, పరిమితి దాటితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. గత ఎన్నికల్లో తనను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చు చేశారని, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారని గుర్తు చేశారు. గత పాలకుల హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని, రాష్ట్రవ్యాప్తంగా 12,500 కేంద్రాలకు కనీస భవన సౌకర్యాలు కూడా లేవని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందని, ఇప్పటికే 2,000 కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే అది ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నాయని ఆమె మండిపడ్డారు. విమర్శలను పక్కనపెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఐటీడీఏల బలోపేతంపై కేంద్రం సమీక్ష

**మొదటిపేజీ తరువాయి..** సారించాలని నిర్ణయించారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్యేక శిక్షణ మరియు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ల అవసరాన్ని ఈ సమావేశంలో నొక్కి చెప్పారు. ముఖ్యంగా 'తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్' (టాస్క్) ద్వారా యువతకు మెరుగైన శిక్షణ అందించడంపై చర్చించారు. అటవీ హక్కుల చట్టం అమలు, భూ సమస్యల పరిష్కారం, గిరిజనుల వలసల నియంత్రణ మరియు గిరిజన హక్కుల పరిరక్షణ వంటి కీలక అంశాలపై సమగ్ర కార్యాచరణను గ్రామ స్థాయిలో రూపొందించి అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. గిరిజన విద్యాభివృద్ధిలో భాగంగా స్థానిక భాషల్లో ప్రాథమిక విద్యను అందించడం, ఆశ్రమ పాఠశాలలను ఆధునీకరించడం, మరియు పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. వీటితో పాటు గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు మరియు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాలను ప్రోత్సహించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## హోర్ముజ్ జలసంధిని దాటిన భారత నౌక 'జగ్ విక్రమ్'

**మొదటిపేజీ తరువాయి..** భారతీయ సరకు రవాణా నౌకల సంఖ్య ఈ ప్రయాణంతో 9కి చేరుకుంది. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారతీయ రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమ దిశలో నిలిచిపోయాయి. వీటిలో ఎల్పీజీ ట్యాంకర్లు, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. కొన్ని నౌకలకు మరమ్మతులు జరుగుతుండగా, మొత్తం 15 నౌకలు కూడా త్వరలోనే హోర్ముజ్‌ను దాటి తమ ప్రయాణాన్ని కొనసాగించే అవకాశం ఉంది.

# తెలంగాణ ఇంటర్ ఫలితాల విడుదల

**మొదటిపేజీ తరువాయి..** లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అధికారిక వెబ్‌సైట్లను సందర్శించి, తమ హాల్ టికెట్ నంబర్ నమోదు చేయడం ద్వారా ఫలితాలను మరియు మార్క్స్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా: ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలు పొందే సదుపాయాన్ని కల్పిస్తోంది. ఇందుకోసం మీ స్మార్ట్‌ఫోన్‌లో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకుని, 'హాయ్' (hi) అని టైప్ చేసి పంపడం ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు.

వెబ్‌సైట్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఫలితాల కోసం వేచి చూసే విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్లతో పాటు పైన పేర్కొన్న ఇతర వెబ్‌సైట్లను కూడా పరిశీలించవచ్చు. విద్యార్థులందరికీ మంచి ఫలితాలు రావాలని ఆకాంక్షిస్తున్నాము.

# ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ ప్రతినిధుల కీలక చర్చలు

**మొదటిపేజీ తరువాయి..** అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందంలో ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్నర్ ఉన్నారు. ఇరాన్ తరఫున పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘలీబాఫ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. చర్చలు జరుగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌పై మరింత కఠినమైన దాడులు తప్పవని స్పష్టం చేశారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, తన సైన్యం అత్యుత్తమ ఆయుధాలతో ఇరాన్‌పై దాడికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదన్నది తమ ప్రధాన డిమాండ్ అని ఆయన పునరుద్ఘాటించారు. తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్' (ఒతీబ్ష్ట్ర) వేదికగా, ఇరాన్ తీరుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే, వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

మరోవైపు, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ, తాము అపనమ్మకంతోనే చర్చల్లోకి ప్రవేశిస్తున్నామని, ఒకవేళ తమపై తిరిగి దాడులు జరిగితే ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇరాన్ ఇప్పటికే తనదైన శైలిలో 10 పాయింట్ల శాంతి ప్రతిపాదనను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

ఈ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి సమస్యకే పరిమితం కాకుండా, మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొల్పే దిశగా సాగుతాయని పాకిస్థాన్ ఆశిస్తోంది. అయితే, లెబనాన్ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉన్న తీవ్ర విభేదాలు, అపనమ్మకం ఈ చర్చల ఫలితాలపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి.

# అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో ట్రంప్ వ్యూహం

**మొదటిపేజీ తరువాయి..** జరుపుతున్నారు. చర్చల ఆలస్యానికి ప్రధాన కారణం ఇరాన్ విధించిన షరతులేనని తెలుస్తోంది. ప్రధానంగా లెబనాన్‌లో కాల్పుల విరమణ అమలు చేయాలని మరియు గతంలో స్తంభింపజేసిన తమ నిధులను విడుదల చేయాలని ఇరాన్ అమెరికాను కోరుతోంది. ఈ రెండు షరతులు నెరవేరితేనే చర్చలు ముందుకు సాగుతాయని ఇరాన్ స్పష్టం చేసింది. ఒకవైపు చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతుంటే, మరోవైపు ఇరాన్ పట్టుబడుతున్న షరతులు కాల్పుల విరమణ ప్రయత్నాలను క్లిష్టతరం చేస్తున్నాయి. అమెరికా తన చమురు ఎగుమతుల ద్వారా ప్రపంచ ఇంధన మార్కెట్‌ను ప్రభావితం చేస్తూనే, ఈ దౌత్యపరమైన ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కొంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

**హైదరాబాద్, ఏప్రిల్11 :**
హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో, ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పాతబస్తీకి చెందిన అబ్దుల్ సోహెద్ (20) షేక్ సాహిల్ (17)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పూలే ఆశయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన, బడుగు బలహీన వర్గాలకు ధైర్యాన్నిచ్చిన మహనీయుడు పూలే అని ఆయన కొనియాడారు. చదువు, ఆర్థికాభివృద్ధి ద్వారానే సమాజం బాగుపడుతుందని నమ్మిన పూలే, సతీమణి సావిత్రీబాయితో కలిసి 52 పాఠశాలలను స్థాపించి అక్షర జ్ఞానాన్ని అందించిన గొప్ప సంస్కర్త అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పూలేను తన గురువుగా భావించారంటేనే ఆయన గొప్పతనం అర్థమవుతుందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూలే ఆశయాలకు పూర్తిగా భిన్నంగా పాలన సాగిస్తోందని బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలోని విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని, అక్షరాస్యతలో తెలంగాణ జాతీయ సగటు కంటే వెనుకబడి ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆరోపించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందడం లేదని, ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా అమ్ముతూ భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పూలే కేవలం మాటల్లోనే కాకుండా, చేతల్లో కూడా ప్రజలకు ఆదర్శంగా నిలిచారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా పూలే ఆశయాలను గౌరవించి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

పోలీసుల నుంచి పారిపోయే యత్నం

కాల్పుల్లో నిందితుడు వెంకటేశ్ కాలుకు గాయాలు

కడప,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ):ఖాజీపేట విద్యార్థిని రామకీర్తనను చంపిన ప్రేమోన్మాది వెంకటేష్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడిని మైదుకూరు నుంచి తీసుకెళుతుండగా.. బాసాపురం చెక్‌పోస్ట్ దగ్గర పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అడ్డుకోవటంతో వారిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే సీఐ వంశీధర్ నిందితుడిపై కాల్పులు జరిపారు. దీంతో నిందితుడి కాలికి గాయం అయింది. పోలీసులు అతడిని కడప రిమ్స్‌కు తరలించారు. కడప జిల్లాలోని ఖాజీపేట మండలం ఆంజనేయకోట్టాలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్ అనే యువకుడు, అదే మండలం ఖాజీపేట అగ్రహారానికి చెందిన రామకీర్తనను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. ఇందుకు బాలిక నిరాకరించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అక్కడికి వెళ్లాడు. పెళ్లి చేసుకోమంటూ ఒత్తిడి తెచ్చాడు. బాలిక ఇందుకు ఒప్పుకోకపోవటంతో ఆగ్రహానికి గురయ్యాడు. వెంటతెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడికి దిగాడు. బాలిక గొంతు కోసి అక్కడినుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి శ్రీనివాసులు హుటాహుటిన ఇంటికి వెళ్లాడు. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆమెను చేతులతో మోసుకొని వాహనంలోకి చేర్చాడు. కూతురిని కడప రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేశాడు. కొనఊపిరితో ఉన్న బాలిక వెంకటేశ్‌తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి పేరును తండ్రికి చెప్పింది. మార్గం మధ్యలో చెన్నూరు వద్ద ప్రాణాలు కోల్పోయింది.

# హైవేపై నిలిపిన వాహనాలే టార్గెట్

### డీజిల్ దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

### వేయి లీటర్ల డీజిల్ సహా వాహనాలు స్వాధీనం

**నల్గొండ, ఏప్రిల్11 :** రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# రేషన్ మాఫియాకు షాక్: 250 క్వింటాళ్ల బియ్యం సీజ్!

- ఇల్లందులో ఆగని 'రేషన్' దోపిడీ
- ఏళ్ల తరబడి మాఫియా రాజ్యమేలుతున్నా నిమ్మకు నీరెత్తిన యంత్రాంగం!

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)

పేదవాడి ఆకలి కేకల మీద అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. ఇల్లందులో రేషన్ బియ్యం అక్రమ రవాణా నిన్న మొన్నటిది కాదు.. ఇది దశాబ్ద కాలంగా సాగుతున్న ఒక వ్యవస్థీకృత నేరం. తాజాగా రేపల్లెవాడలో పట్టుబడిన 250 క్వింటాళ్ల బియ్యం ఈ భారీ మాఫియా నెట్‌వర్క్‌లో కేవలం ఒక చిన్న భాగం మాత్రమే!

**అసలేం జరుగుతోంది?**

ఇల్లందు కేంద్రంగా పక్కా ప్లాన్‌తో ఈ మాఫియా నడుస్తోంది. మూడు నెలల కోటాను ప్రభుత్వం ఒకేసారి విడుదల చేయడంతో, దళారులు ఇదే అదనుగా భావించి గ్రామాల్లో తిష్ట వేశారు.


మూలాల వద్దే అక్రమం: కొందరు రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా, వెనుక తలుపుల ద్వారా ఈ మాఫియాకు తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

ఏళ్ల తరబడి సాగుతున్న దందా: గత కొన్నేళ్లుగా ఇల్లందులో టన్నుల కొద్దీ బియ్యం పక్కదారి పడుతున్నా, అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వానికి, అధికారులకు "హెచ్చరిక" - ఇకనైనా నిద్రలేవండి!**

యంత్రాంగం వైఫల్యం: క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సిన అధికారులు మాఫియాకు వత్తాసు పలుకుతున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో






కలుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మానుకోవాలి.

పిడి యాక్ట్ ఎందుకు ప్రయోగించరు?: పదే పదే పట్టుబడుతున్నా, నిందితులు మళ్ళీ బయటకు వచ్చి అదే దందా ఎందుకు చేస్తున్నారు? అక్రమార్కులపై పిడి యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపకపోతే ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రజలు ప్రశ్నించడం ఖాయం.

డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలి:అక్రమాల్లో భాగస్వాములైన డీలర్లపై కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలి.

**మాఫియా డాన్లకు అల్టిమేటం!**

"ఇది కేవలం బియ్యం పట్టివేత మాత్రమే కాదు.. రేషన్ మాఫియా అంతానికి ఆరంభం కావాలి. పేదవాడి కడుపు కొట్టి మీరు మేడలు కడితే, ఆ మేడల పునాదులు కదలడం ఖాయం. చట్టం తన పని తాను చేసుకుపోతే, మీ స్థానం కటకటాల వెనుకే ఉంటుంది."ఇల్లందులో పేదవాడికి అందాల్సిన ప్రతీ గింజ వారి కడుపు నింపాలి కానీ, దళారుల జేబులు నింపకూడదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సమగ్ర విచారణ జరిపి, ఈ మాఫియా నెట్‌వర్క్‌ను పూర్తిగా తుడిచిపెట్టాలని ఇల్లందు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజలే రోడ్లపైకి వచ్చి పోరాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

# ఇల్లందులో పోలీసుల ఉక్కుపాదం

- సీఐ సురేష్, డీఎస్పీ వెంకన్నబాబు ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)

పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు రంగంలోకి దిగారు. విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు పాల్వంచ కేటీపీఎస్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు.

అప్రమత్తత: అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అనవసర రాకపోకలను నియంత్రిస్తున్నారు.

చొరవ: కార్మికులు సంఘటితమై వెళ్లకుండా తనదైన శైలిలో బృందాలను మోహరించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**డీఎస్పీ వెంకన్నబాబు పర్యవేక్షణలో భారీ బందోబస్తు**

మొత్తం భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ వెంకన్నబాబు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఆయన పట్టణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. "చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు వెళ్లేవారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరిస్తూ, డీఎస్పీ పలువురు కార్మికులను అదుపులోకి తీసుకుని విచారించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇల్లందు పట్టణం పోలీసుల నీడలో ఉంది. డీఎస్పీ, సీఐల



ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. నిరసనలకు వెళ్లే ప్రయత్నం చేసిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు.

# కొమ్ముగూడెం అడవిలో భారీ అగ్నిప్రమాదం

- అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)

భానుడి భగభగలకు అడవి నిప్పుల కొలిమిలా మారుతోంది. ఇల్లందు మండలం రొంపేడు పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం అటవీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. వేసవి తీవ్రత దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో, కొమ్ముగూడెం సమీపంలోని జామాయిల్ తోటలో మంటలు చెలరేగాయి. ఎండుటాకులు ఉండటంతో నిమిషాల వ్యవధిలోనే మంటలు తోటంతా వ్యాపించి బీభత్సం సృష్టించాయి. ఆకాశాన్ని తాకుతున్న పొగను గమనించిన స్థానికులు, వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.



సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు: సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందించకపోయి ఉంటే మంటలు పక్కనే ఉన్న జనవాసాలకు లేదా దట్టమైన అటవీ ప్రాంతానికి విస్తరించి భారీ నష్టం వాటిల్లేదని అధికారులు పేర్కొన్నారు.

అధికారుల హెచ్చరిక: "ఎండలు తీవ్రంగా ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు అగ్ని ప్రమాదాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. నిప్పు రవ్వల పట్ల అశ్రద్ధ వహించవద్దు."

# మత్తు వీడండి.. మనిషిగా జీవించండి కలెక్టర్ అంకిత్ కుమార్

- వ్యసన రహిత సమాజమే లక్ష్యం
- వ్యసన బాధితులకు అండగా 'కౌన్సిలింగ్ సెంటర్'

కొత్తగూడెం ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)

మత్తు మహమ్మారి నుంచి సమాజాన్ని రక్షించే ఉద్దేశంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అడిక్షన్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యక్తిగత ఆరోగ్యం: మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది.

సామాజిక ప్రభావం: వ్యసనం కేవలం ఒక్క వ్యక్తికి మాత్రమే పరిమితం కాదని, అది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తూ సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

సమగ్ర చికిత్స: ఈ కేంద్రం ద్వారా బాధితులకు కేవలం మందులు మాత్రమే కాకుండా, మానసిక ధైర్యాన్ని ఇచ్చే కౌన్సిలింగ్, పునరావాస సేవలు ఒకే చోట లభిస్తాయని పేర్కొన్నారు.




# విద్యాదాత, అణగారిన వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే....

- రాజ్య సభ ఎం.పీ డా కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ బ్యూరో /ఏప్రిల్ 11(జనసంఘర్షణ )



ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎం.పీ డా కె.లక్ష్మణ్, గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్, బిజెపి నాయకులు. ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ మాట్లాడుతూ..ప్రముఖ భారతీయ సంఘ సంస్కర్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడు, మహిళా విద్యాదాత అయిన పూలే, అణగారిన వర్గాల సమానత్వం కోసం కృషి చేశారన్నారు. సామాజిక సమానత్వం పట్ల పూలే నిబద్ధత విద్యకు దీటుగా విస్తరించిందనీ. ఆయన కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారనీ, అణగారిన వర్గాల, ముఖ్యంగా నిమ్న కులాల, మహిళల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారనీ పూలే సేవలను గుర్తు చేసారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బిజెపి సికింద్రబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్, బిజెపి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రామ్, కార్యదర్శి సలంద్రి శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, శ్రీకాంత్, పాల శ్రీనివాస్, సత్తి రెడ్డి, ఆనంద్ రావు, నీరజ్ అరుంధతి బస్తీ నాయకులు మెరుగు శ్రీనివాస్, యాదగిరి, రాజ్ కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు భూక్య సురేష్ నాయక్

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)



ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై కోటి లింగాల సమీపంలో జరిగిన ఘటనలో బీఆర్ఎస్ యువ నాయకుడు భూక్య సురేష్ నాయక్ మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు పక్కన స్పృహలో ఉన్న భూక్య రాములు అనే వ్యక్తిని గమనించిన సురేష్ నాయక్ వెంటనే స్పందించారు. మహబూబాబాద్ జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన రాములు రోడ్డు పక్కన అనారోగ్య స్థితిలో ఉండగా, అతన్ని నిర్లక్ష్యం చేయకుండా సురేష్ నాయక్ సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో అతనికి అవసరమైన సహాయం అందించడమే కాకుండా, పరిస్థితిని పరిశీలించి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలు సురేష్ నాయక్ చూపిన మానవత్వాన్ని అభినందించారు. అత్యవసర సమయంలో స్పందించి ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చిన ఆయన సేవా భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# మొక్కజొన్న రైతులకు మద్దతు ధర సెగ

- క్వింటాల్‌కు రూ.3వేలు చెల్లించాలని డిమాండ్

కొత్తగూడెం ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)



జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన రైతాంగం గిట్టుబాటు ధర కోసం గళమెత్తుతోంది. ఆకాశాన్నంటుతున్న పెట్టుబడి ఖర్చుల దృష్ట్యా, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ మొక్కజొన్నకు రూ.3,000 మద్దతు ధర కల్పించాలని రైతు సంఘాలు, సాగుదారులు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ఆంక్షలు తొలగించాలి: క్వింటాల్‌కు రూ.3,000 చెల్లించడంతో పాటు, ప్రస్తుతం అమల్లో ఉన్న 26 క్వింటాళ్ల గరిష్ఠ పరిమితి నిబంధనను తక్షణమే రద్దు చేయాలి.

పూర్తి స్థాయి సేకరణ: నిబంధనల సాకుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా, పండించిన ప్రతి గింజను ప్రభుత్వం సేకరించాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల పెంపు: రైతుల రవాణా కష్టాలను దృష్టిలో ఉంచుకుని, మరిన్ని అదనపు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విన్నవించారు. పెట్టుబడులు పెరిగి, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చే ధర తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దిగుబడి ఎక్కువగా ఉన్నప్పటికీ, పరిమితుల పేరుతో కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. జిల్లా యంత్రాంగం, మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి, ఆంక్షలు లేని కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

# 'సంకల్పం ముందు మోకరిల్లిన విధి' నర్సింగ్ ఆఫీసర్‌గా గణపరపు మనీషా

- కష్టాల కడలిని దాటి 'లక్ష్య' తీరానికి, వంశీ కృష్ణ తోడ్పాటుతో నర్సింగ్ ఆఫీసర్‌గా మనీషా ఘన విజయం

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)



ఎన్ని సవాళ్లు ఎదురైనా, ఆశయ సాధనలో వెనకడుగు వేయని పట్టుదల ఉంటే విజయం వరించి తీరుతుందని గణపరపు మనీషా నిరూపించారు. తల్లిదండ్రుల ఆశీస్సులను గుండెల్లో నింపుకుని, వారు కన్న కలను నిజం చేసే క్రమంలో ఆమె సాగించిన ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. మూడు సంవత్సరాల క్రితం వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన మనీషా, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే పట్టువదలని సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమయ్యారు. గత ఏడాది కేవలం రెండు మార్కుల స్వల్ప తేడాతో అవకాశం చేజారినప్పటికీ, ఆ వైఫల్యాన్ని గుణపాఠంగా మార్చుకుని, ఉద్యోగం చేస్తూనే లభించిన ప్రతి క్షణాన్ని చదువుకు అంకితం చేశారు. ఈ కఠిన ప్రయాణంలో ఆమె భర్త గణపరపు వంశీకృష్ణ అందించిన అచంచలమైన సహకారం, ప్రోత్సాహం తన విజయానికి ప్రధాన కారణమని మనీషా గర్వంగా చెబుతున్నారు. తన శక్తిని తనే నమ్ముకుని, భర్త తోడ్పాటుతో లక్ష్యాన్ని చేరుకున్న మనీషా ఉదంతం, పట్టుదల ఉంటే ఏ అడ్డంకినైనా అధిగమించవచ్చని చాటిచెబుతూ నేటి తరం మహిళలకు ఒక గొప్ప దిక్సూచిగా నిలుస్తోంది.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి

❑ 'సమానత్వ సాధకుడు పూలే'

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)
బహుజన బాంధవుడు, కుల వివక్షపై రాజీలేని పోరాటం చేసిన అలుపెరగని యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సింగరేణి ఎస్ఎస్పీసీ నాయకులు కొనియాడారు. శనివారం ఇల్లందులోని సంస్థ కార్యాలయంలో పూలే 199వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.
ఘన నివాళులు: కార్యక్రమం ప్రారంభంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే చేసిన త్యాగాలను, ఆశయాలను స్మరించుకున్నారు.
స్త్రీ విద్యకు ఆద్యుడు: 1848లోనే తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి, అనేక సామాజిక ఆంక్షల మధ్య తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి స్త్రీ విద్యకు పునాది వేశారని గుర్తుచేశారు.
సామాజిక విప్లవం: అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతలపై అప్పట్లోనే గళమెత్తి, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని కొనియాడారు.
నేటి సమాజానికి స్ఫూర్తి: పూలే ఆశయాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. "19వ శతాబ్దంలోనే సమానత్వ జెండాను ఎగురవేసి, చదువుతోనే సాధికారత సాధ్యమని నమ్మిన మహనీయుడు జ్యోతిరావు పూలే." సింగరేణి ఎస్ఎస్పీసీ ప్రతినిధులు.



# రేషన్ మాఫియాపై అదనపు కలెక్టర్ 'వేటు'

❑ 450 క్వింటాళ్ల బియ్యం సీజ్!

ఇల్లందు ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)
పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కుల గుండెల్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వణుకు పుట్టించారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో దాడులను ఉధృతం చేశారు. ఈ వరుస దాడుల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 450 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
నిఘా నీడలో నియోజకవర్గం: దాడుల వివరాలు జిల్లాలో అక్రమ రవాణాకు అడ్డాగా మారిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచిన యంత్రాంగం, మెరుపు దాడులతో విరుచుకుపడింది.



ఇల్లందు మండలం: ఇక్కడ నిర్వహించిన తనిఖీల్లో 200 క్వింటాళ్ల అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు.
టేకులపల్లి మండలం: అత్యంత భారీగా 250 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు.
అదనపు కలెక్టర్ సీరియస్ వార్నింగ్: ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ అక్రమార్కులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు "పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. పీడీఎస్ బియ్యం పక్కదారి పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవు. జిల్లా సరిహద్దుల్లోనూ, ప్రధాన రహదారుల్లోనూ నిరంతరం నిఘా కొనసాగుతుంది." జిల్లాలో పౌరసరఫరాల వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా అదనపు కలెక్టర్ తీసుకుంటున్న ఈ చర్యలు అక్రమార్కుల ఆటకట్టించేలా ఉన్నాయి. రాబోయే రోజుల్లో తనిఖీలు మరిన్ని పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# ఆర్టిజన్ల పోరులో 'గర్జించిన' బుడగం నాగేశ్వరరావు


కొత్తగూడెం ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)
తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల న్యాయపోరాటం ఇప్పుడు ఒక మలుపు తిరిగింది. కార్మికుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణిపై ప్రముఖ నాయకులు బుడగం నాగేశ్వరరావు నిప్పులు చెరిగారు. కార్మికుల పక్షాన నిలబడి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**ఖైదీల్లా కార్మికులు.. పహారాలో సమ్మె కేంద్రాలు**

రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రాంతాలను పోలీస్ బలగాలు చుట్టుముట్టడంపై బుడగం నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులను నేరస్తుల్లా చూడటం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. "ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాల్సింది పోయి, పోలీస్ బలగాలతో భయభ్రాంతులకు గురిచేయడం ఏ రకమైన పాలన?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కార్మికుల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**హంతకులే సంతాప సభకు వచ్చినట్లు.. బిఆర్ఎస్ తీరుపై విసుర్లు**

బిఆర్ఎస్ నాయకుల ప్రస్తుత తీరును బుడగం నాగేశ్వరరావు తనదైన శైలిలో ఎండగట్టారు. గతంలో కార్మికుల శ్రమను గుర్తించని వారు, నేడు మద్దతు పలుకుతుంటే అది "హంతకులే సంతాప సభకు వచ్చినట్లుగా ఉంది" అంటూ ఆయన వేసిన సెటైర్లు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం రాజకీయ లబ్ధి కోసం కార్మికులను వాడుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.
ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలబడే (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్) తరపున నాగేశ్వరరావు ప్రభుత్వ పెద్దలకు ఒక బలమైన హెచ్చరిక జారీ చేశారు. "ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.. అణచివేసే కొద్దీ తిరుగుబాటు పెరుగుతుంది. అణచివేతకు భయపడటానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు. ఆర్టిజన్ కార్మికులలో ప్రతి ఒక్కరూ ఒక సుభాష్ చంద్రబోస్ లాగా తయారు అయితే, ఆ కణికల వేడికి మీ ప్రభుత్వాలు తట్టుకోలేవు" అని ఆయన హెచ్చరించారు.
కార్మిక నాయకులతో తక్షణమే చర్చలు జరపాలని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బుడగం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చర్చలు జరపకుండా కాలయాపన చేస్తే, ఈ పోరాటం మరింత




ఉధృతమవుతుందని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నాగేశ్వరరావు నాయకత్వంలో ఆర్టిజన్ కార్మికులు ఇప్పుడు మరింత ఉత్సాహంతో తమ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

# సింగరేణి సమస్యల పరిష్కారమే లక్ష్యం

❑ జిఎం కిరణ్ కుమార్‌తో మేయర్ మూడ్ గణేష్ కీలక భేటీ!

కొత్తగూడెం ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)



కొత్తగూడెం పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా ఒక సానుకూల అడుగు పడింది. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం (హెడ్ ఆఫీస్) నందు సింగరేణి జిఎం (పర్సనల్) కిరణ్ కుమార్‌ని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిఎంను శాలువాతో సత్కరించి, పూలమొక్కను అందజేసిన మేయర్.. స్థానిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సింగరేణి యాజమాన్యం సహకారం ఉంటేనే మరిన్ని మౌలిక వసతులు మెరుగుపడతాయని, ఆ దిశగా జిఎం చొరవ చూపాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జిఎం కిరణ్ కుమార్, మేయర్ గణేష్‌ని సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతూ.. సంస్థ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ భేటీలో సింగరేణి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమణమూర్తి, వంగా వెంకట్ ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# భైంసాలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

భైంసా, ఏప్రిల్ 11: (జన సంఘర్షణ)



స్థానిక భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మహాత్మ జ్యోతిరావు పూలే సమాజ అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా విద్య, సామాజిక సమానత్వం, దళితుల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ లైబ్రరీ విద్యార్థులు, ముధోల్ మాజీ ఎంపీపీ సుభాష్ పటిల్, ఫ్యాక్టరీ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ.. పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.

# గిరిజన గడ్డపై 'వైద్య యోధుల' సేవలు అభినందనీయం


❑ వైద్య సేవల్లో జిల్లా మేటి కలెక్టర్ అంకిత్
❑ ఏజెన్సీ ప్రాంతాల్లో 100% ఆరోగ్య రక్షణ.




కొత్తగూడెం ఏప్రిల్ 11 (జన సంఘర్షణ)
మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రశంసల జల్లు కురిపించారు. సవాళ్లతో కూడిన ఏజెన్సీ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది తమ అంకితభావంతో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడం విశేషమన్నారు.
ఏజెన్సీలో 'ఆరోగ్య' భరోసా: జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ ఇబ్బందులు ఉన్నప్పటికీ, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువవుతున్న తీరును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.
రాష్ట్రస్థాయి గుర్తింపు: జిల్లా వైద్య యంత్రాంగం చూపిస్తున్న ప్రతిభ వల్ల రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.
మెరుగైన ఫలితాలు: మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో పర్యటిస్తూ, వ్యాధుల నివారణలో మరియు ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంలో వైద్యశాఖ పోషిస్తున్న పాత్రను ఆయన విశ్లేషించారు.
సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు: "ప్రజల ప్రాణాలను కాపాడటంలో వైద్యుల పాత్ర వెలకట్టలేనిది. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించి, జిల్లాను ఆరోగ్య రంగంలో అగ్రస్థానంలో నిలపాలి. మీ సేవలకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుంది."

# పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)



సమాజంలో సమానత్వం , మహిళా విద్య కోసం అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే 199వ జయంతిని బయ్యారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బయ్యారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో అంధకారాన్ని తొలగించి జ్ఞానదీపం వెలిగించిన మహానుభావుడు పూలే అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచి, విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని నిరూపించిన మహామేధావి అని కొనియాడారు. పూలే చూపిన మార్గంలో నడుస్తూ, విద్య, సమానత్వం, న్యాయం కోసం మనమంతా కట్టుబడి ఉండాలని, ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా, రంజిత్, వార్డు సభ్యులు బానోత్ అజయ్, బందెల కళింగరెడ్డి, బానోత్ సునీత, పెద్దిని శాంత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిని వెంకటేశ్వరరావు తదితరులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవిలింగల్ పాఠశాలలో ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -11(జన సంఘర్షణ )



సంఘసంస్కర్త, సామాజిక తత్వవేత్త, విద్యా ప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతిని అడవిలింగల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహనీయుడు జ్యోతిరావు పూలే బాలికల విద్య గురించి చేసిన కృషి మరువలేనిది. బాల్యవివాహాలను అరికట్టడం, వితంతువు పునర్వివాహం, వితంతువుల కోసం ఆశ్రమాలు ఏర్పాటు చేయడం, అనాథ పిల్లల ఆశ్రమాలు ఏర్పాటు చేయడం, చిన్న తరహా పరిశ్రమల శ్రామికుల గురించి పోరాటం చేయడం, వ్యవసాయదారుల హక్కుల గురించి ప్రభుత్వాన్ని చెప్పడం, సమాజంలో ఉన్నటువంటి దురాచారాలను, అంటరానితనాన్ని, మూఢనమ్మకాలను తొలగించుటకు సత్యాన్ని సోదించే, సత్య శోధక్ సమాజం ఏర్పాటు చేసి కట్నకానుకలు, మంత్ర తంత్రాలు లేని పెళ్లిళ్లు చేయడం, శాస్త్రీయ విద్యను బోధించడం, కరువు కాటకాలలో పేదలకు భోజన సదుపాయం కల్పించడం అనేక సామాజిక అంశాలలో చేసిన కృషి పట్టుదల త్యాగం పోరాటములను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్, కనిరామ్, వివి కల్పన తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు ఘన సన్మానం

శ్రీకాళహస్తి ఏప్రిల్ 11 (జన సంఘర్షణ):
కిసాన్ కాంగ్రెస్ పార్టీ 90 సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా 91 సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్. బత్తైయ్య నాయుడుతో కలిసి తిరుపతి జిల్లా కిసాన్ అధ్యక్షుడు కే. జనార్ధన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి 9మంది రైతులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. ఎస్.బత్తైయ్య నాయుడు, కే.జనార్ధన్ రెడ్డి, కూలి .రవికుమార్, ఎం. వెంకట ముని, ఎం. వడివేలు మొదలియార్, ఇర్ల .గోపి, శెట్టిపల్లి .శివ, ఎస్.నాగూర్ అయ్యా, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

చిత్తూరు ఏప్రిల్ 11 ( జనసంఘర్షణ )




పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త ఎస్ఎం రషీద్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరులో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాపూరావు పూలే జయంతిని పురస్కరించుకొని పిసిఆర్ సర్కిల్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ కోసం పూలే చేసిన సేవలు ఎంతో గొప్పవని తెలిపారు. ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని, విద్యార్థులు సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ పూలే ఆశయాలను సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సమానత్వం, విద్యా హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ఎంతో ప్రేరణాత్మకమన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పనిచేస్తూ పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సంతపేట షౌకత్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్ అహ్మద్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా ట్రెజరర్ అబ్దుల్ రహీం బాబు , గౌస్ మొహద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కొంగర వినిత దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొనడం



◆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం

ఇల్లందు ప్రతినిధి :(జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గానికి చెందిన బయ్యారం మండలం కొత్తపేట-గంధంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మగడ్డ మల్లిఖార్జున్ కుమార్తె కొంగర వినిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె దశదిన కార్యక్రమం మియాపూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై, వినిత చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కొత్తపేట-గంధంపల్లి సర్పంచ్ భుక్యా ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సబ్సిడీ ద్వారా మామిడి కవర్స్ పంపిణీ

◆ ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు మోహన్ మురళి




వెదురుకుప్పం: ఏప్రిల్ 11 ( జనసంఘర్షణ )

వెదురుకుప్పం మండలం వెదురుకుప్పం రైతు భరోసా కేంద్రంలో హార్టికల్చర్ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో మామిడి కాయల కవర్స్‌ను ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షులు మోహన్ మురళి. ఈ కార్యక్రమంలో మోహన్ మురళి మాట్లాడుతూ.. కవర్ రెండు రూపాయలు ప్రభుత్వం ఒక రూపాయి అందిస్తుందని అని తెలిపారు. రైతుల ఒక రూపాయి చెల్లించి కవర్లను పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి చెంగల్రాయిరెడ్డి, నియోజకవర్గ టిఎన్టిసి అధ్యక్షులు బాబు నాయుడు, క్లస్టర్ త్రీ కన్వీనర్ చంద్రబాబు రెడ్డి క్లస్టర్ ఫోర్ కన్వీనర్ రమణ రెడ్డి,కన్వీనర్ లు రాజశేఖర్ వర్మ,భాస్కర్ రెడ్డి, తిరుమలరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటాద్రి నాయుడు, అనిల్, ఏఎంసి డైరెక్టర్ బాలాజీ రెడ్డి, ఏఎంసి రెడ్డి మాధవనాయుడు, శ్రీరాములునాయుడు, నాగరాజురెడ్డి, ఏఎంసి రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పి కావ్య, ఎస్ పవిత్ర, ధనలక్ష్మి, కే.నరేష్, బేలప్ప, కే జాహ్నవి, రజిత, రైతులు పాల్గొన్నారు.

# ఎఐకెయస్ ఆవిర్భావ స్ఫూర్తితో వాణిజ్య ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

◆ ఎఐకెయస్ వార్షికోత్సవ సభలో తీగల సాగర్, మల్లారెడ్డి

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 11( జనసంఘర్షణ )

ఏఐకేఎస్ ఆవిర్భావ స్ఫూర్తితో వాణిజ్య ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడుదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు(ఏప్రిల్ 11) ఆర్ టి సి క్రాస్ రోడ్లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం జెండాను సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన జరిగిన సభలో తీగల సాగర్, సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ... భారత రైతాంగ చరిత్రలో ఇదొక సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు. దేశంలోని రైతులను ఒకే తాటిపైకి తెచ్చి, వారి హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న అఖిల భారత కిసాన్ సభ నేటితో 90 వసంతాలను పూర్తి చేసుకుంది. 1936లో లక్నో వీధుల్లో చిన్న మొలకగా ప్రారంభమైన ఈ సంస్థ, నేడు కోట్లాది మంది రైతుల గొంతుకగా మారి మహా వృక్షంలా విస్తరించింది. కిసాన్ సభ కేవలం ఒక సంఘం కాదు. అది శతాబ్దాల అణచివేతకు వ్యతిరేకంగా వచ్చిన ఒక విస్ఫోటనం. 1770లో బెంగాల్‌లో వచ్చిన కరువులో దాదాపు కోటి మంది చనిపోయారు. జనాల్ని ఆదుకోవాల్సిన బ్రిటిష్ ప్రభుత్వం శిస్తు వసూలును ఆపకపోగా, మరింత కఠినంగా వ్యవహరించింది. ఈ దుర్భర పరిస్థితులే రైతాంగంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆవేశాన్ని పెంచాయి. రైతుల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించడానికి ఒక వేదిక కావాలని వామపక్ష నాయకులు, సోషలిస్టులు నిర్ణయించారు. 1936 జనవరిలో మీరట్‌లో జరిగిన సమావేశం దీనికి బీజం వేసింది. చివరగా ఏప్రిల్ 11, 1936న లక్నోలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. మొదటి అధ్యక్షుడు స్వామి సహజానంద సరస్వతి (బీహార్ రైతు నాయకుడు), ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.జి. రంగ (ఆంధ్రప్రదేశ్ నుండి). ఈ సదస్సులో నెహ్రూ వంటి నాయకులు హాజరయ్యారు. సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించడమే కాకుండా, భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయడమే తమ అంతిమ లక్ష్యమని కిసాన్ సభ ప్రకటించింది. కిసాన్ సభ చరిత్ర అంతా త్యాగాలమయం. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత ఈ సంస్థ నేతృత్వంలో జరిగిన కొన్ని కీలక పోరాటాలు ఇక్కడ ఉన్నాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం (1946-1951) ఇది ప్రపంచ రైతాంగ ఉద్యమాల్లోనే ఒక అద్భుతం. నిజాం నవాబు, అతని సాయుధ బలగాలైన రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతులు వీరోచితంగా పోరాడారు. దాదాపు 3000 గ్రామాల్లో రైతుల రాజ్యం (గ్రామ స్వరాజ్యం) ఏర్పడింది. 10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచారు. ఈ పోరాటంలో 4,000 మందికి పైగా అమరులయ్యారు. ఇది భారతదేశంలో భూసంస్కరణలకు ప్రధాన ప్రేరణగా నిలిచింది. తెభాగా ఉద్యమం (బెంగాల్) "పంటలో మూడింట రెండు వంతులు కౌలుదారుడికే దక్కాలి" అనే డిమాండ్‌తో బెంగాల్‌లో ఈ ఉద్యమం సాగింది. పున్నప్ర-వయలార్, కయ్యూర్ కేరళలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో వందలాది మంది కిసాన్ సభ కార్యకర్తలు బ్రిటిష్, సంస్థానాల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించారు. కిసాన్ సభ కేవలం ఆర్థిక సమస్యల మీదనే కాకుండా, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కూడా పోరాడింది. అంటరానితనం, కుల ఆధిపత్యాన్ని కిసాన్ సభ తీవ్రంగా వ్యతిరేకించింది. మొదటి నుంచీ మహిళలను సంఘటితం చేయడంలో కిసాన్ సభ ముందుంది. కమలాదేవి చటోపాధ్యాయ, గోదావరి పారులేకర్ వంటి మహనీయులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

1991 తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు వ్యవసాయ రంగాన్ని మళ్ళీ సంక్షోభంలోకి నెట్టాయి. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఈ దశలో కిసాన్ సభ




తన పోరాట పంథాను మార్చుకుంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడి ఖర్చుపై 50% లాభం కలిపి కనీస మద్దతు ధర (సి2+50%) ఇవ్వాలని కిసాన్ సభ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. 2013 భూసేకరణ చట్టానికి వ్యతిరేక పోరాటం నుండి, ఇటీవల ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రక రైతు ఉద్యమం వరకు ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించింది. దేశవ్యాప్తంగా ఉన్న 500 పైగా రైతు సంఘాలను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం) ఏకం చేయడంలో కిసాన్ సభ చురుగ్గా వ్యవహరిస్తోంది. 90 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ కిసాన్ సభ ప్రయాణం నేటికీ పదును తగ్గకుండా సాగుతోంది. నాడు బ్రిటిష్ వారితో, నేడు కార్పొరేట్ శక్తులతో పోరాడుతూ 'అన్నదాత' ఆత్మగౌరవాన్ని కాపాడుతోంది. 1936 నుండి 2026 వరకు ఈ సంస్థ సాధించిన విజయాలు అద్భుతం. రాబోయే కాలంలో కూడా పీడిత రైతాంగం వైపు నిలబడి, సామాజిక న్యాయం కోసం పోరాడటమే ఈ 90 ఏళ్ల వేడుకల అసలైన సందేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, రైతు నాయకులు వెంకట్ రెడ్డి, శివకుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర దేవాలయ పరిధిలో వారాంతపు సంత యథావిధిగా నిర్వహణ

◆ సందిగ్ధత తొలగి సంత కొనసాగింపు

సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ)






గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర దేవాలయం పరిధిలో రేపు (ఆదివారం) జరగనున్న వారాంతపు సంత యథావిధిగా నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రతినిధులు, ఆలయ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల సంత నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు పూర్తిగా తెరపడటంతో గ్రామ ప్రజలు, వ్యాపారులు ఊరట వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా సంత నిర్వహణపై అనిశ్చితి నెలకొనడంతో వ్యాపారులు, రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, ఎండోమెంట్ అధికారులతో కలిసి పలుమార్లు సమావేశాలు నిర్వహించి సమస్యలను సమగ్రంగా చర్చించారు. సంత నిర్వహణలో తలెత్తిన ఇబ్బందులు, ప్రాంగణ వినియోగం, భద్రతా అంశాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యలు వంటి విషయాలను పరిశీలించి, అందరికీ అనుకూలంగా ఉండే విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) మాట్లాడుతూ, గ్రామ ఆర్థిక వ్యవస్థలో సంతకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించే వేదికగా సంత కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అందువల్ల సంతను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా, సజావుగా కొనసాగించే దిశగా చర్యలు తీసుకున్నామని వివరించారు. సంత రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సంత ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేందుకు సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు. వ్యాపారులు క్రమబద్ధంగా తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని, గ్రామ ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు, వ్యాపారులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ప్రతి వారం మాదిరిగానే రేపటి సంత సజావుగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో వ్యాపారులు తమ ఏర్పాట్లను ప్రారంభించగా, గ్రామ ప్రజలు కూడా సాధారణంగా సంతకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామస్థుల సమన్వయం, అధికారుల సహకారంతో సంత విజయవంతంగా నిర్వహించబడుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# పూలే జయంతి సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో ఘన నివాళులు

◆ సమానత్వ సమాజ నిర్మాణానికి పూలే ఆశయాలే మార్గదర్శకం: నాయకులు

ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గంలో భారతీయ సామాజిక సంస్కర్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఇల్లందు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ శ్రేణులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీర భావ్ సింగ్ నాయక్, మండల నాయకులు దేరంగుల పోశం మాట్లాడుతూ పూలే కుల వివక్ష నిర్మూలనకు, అంటరానితనం నిర్మూలనకు శ్రమించిన మహానుభావుడని కొనియాడారు. నిమ్న కులాల హక్కుల కోసం పోరాడి, సమాజంలో సమానత్వానికి బాటలు వేసిన గొప్ప సంస్కర్త అని పేర్కొన్నారు. బాలికలు, వెనుకబడిన వర్గాలకు విద్య అందితేనే సమాజంలో మార్పు సాధ్యమని పూలే గనిరూపించారని, ఆయన ఆశయాలు నేటికీ ప్రాసంగికమని అన్నారు. విద్య, సమానత్వం ద్వారానే సామాజిక-ఆర్థిక అభివృద్ధి సాధ్యమని సూచించారు. అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం కూడా పూలే ఆశయాలకు అనుగుణంగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు. కుల వృత్తులకు గౌరవం పెంపొందించడంలో ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, మండల నాయకులు మూడు హనుమా, పట్టణ మహిళ




ఉపాధ్యక్షురాలు కడగండ్ల నారాయణమ్మ, యువజన నాయకులు గిన్నారపు రాజేష్, కాసాని ప్రసాద్ యాదవ్, ఎస్.కె. చాంద్ పాషా, నీలం రాజశేఖర్, ఇమ్రాన్, నూతనకి వీరభద్రం, ఎస్.కె. పాషా, వాసు ధనాల, బజారు సత్యనారాయణ, బోడ లోకియా తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# పూలే - సామాజిక ఉద్యమ స్ఫూర్తి చిహ్నం

◆ డా.యం.ఉమేష్ రావు, కోట చంద్రశేఖర్.

శ్రీకాళహస్తి ఏప్రిల్ 11(జనసంఘర్షణ): అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, కుల వివక్ష లేని సమాజ స్థాపనే లక్ష్యంగా అలుపెరగని పోరాటం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే... సామాజిక ఉద్యమ స్ఫూర్తి చిహ్నం అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ కొనియాడారు. ప్రముఖ సామాజిక తత్త్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతి రావు పూలే 200 వ జయంతిని పురస్కరించుకొని ఈరోజు తెలుగుదేశం పార్టీ బిసి విభాగం ఆధ్వర్యంలో స్థానిక 18 వ వార్డు పరిధిలోని పూసల వీధి కూడలిలో పూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించిన అనంతరం అందరికీ అంబలి పంపిణీ చేశారు.



**స్త్రీ విద్యకు పునాదులు వేసిన తొలితరం దార్శనికులు - పూలే**

పూలే చూపిన స్ఫూర్తదాయకమైన మార్గంలో నడుస్తూ, స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, దాని తర్వాతనే రాష్ట్రంలో బీసీలకు నిజమైన రాజ్యాధికారం లభించిందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి ముందు వరకు అధికార వ్యవస్థ కొద్ది వర్గాలకే పరిమితమై ఉండేదని, మండల వ్యవస్థను ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని వివరించారు. అంతకుముందు ఉన్న రాజరిక, వంశపారంపర్య రాజకీయాలకు చరమగీతం పాడి, సాధారణ వ్యక్తులను కూడా మంత్రుల స్థాయికి ఎదిగేలా అవకాశాలు కల్పించిన మహా నాయకుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. స్వర్గీయ యన్టీఆర్ ఆశయ స్ఫూర్తితోనే బీసీల సాధికారతకు సియం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, నూర్ మొహమ్మద్, గాజుల భగత్, సంజాకుల మురళీకృష్ణ, యస్వీ. రమణ, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ఆనంద్ గౌడ్, చంద్రబాబు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, గంగనపల్లి రమేష్, సులేమాన్, ప్రభాకర్, భార్గవ్, చంద్రశేఖర్, చలపతి, తేజ, దండపాణి, కృష్ణయ్య, గోపీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళు లర్పించిన సీఎం చంద్రబాబు

కుప్పం,ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): మహాత్మ జ్యోతిరావు పూలేకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్లతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన అసమాన పోరాటాన్ని, సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, బీసీ నేతలు కూడా పాల్గొని పూలే ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక సంస్కర్తగా ఆయన వేసిన బాట నేటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



## ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నేతలకు సన్మానం




కుప్పం,ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నేతలను సన్మానించారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పార్టీ ఇంచార్జ్ మునరత్నంలు ప్రతిభ కనపరిచిన నేతలను సన్మానించి, అభినందించారు. కుప్పం రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షులు ఉదయ్ కుమార్ నాయుడు, కుప్పం మున్సిపల్ 10 క్లస్టర్ ఇంచార్జ్ సోమశేఖర్ లను సన్మానించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పలమనేరు మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షణ్ బ్రాండ్ అంబాసిడర్‌గా నరసింహులు నియామకం

◆ పి.పి.ఎస్, ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

పలమనేరు, ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): పలమనేరు మున్సిపాలిటీని స్వచ్ఛతలో అగ్రగామిగా నిలిపేందుకు మున్సిపల్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. పలమనేరు పరిరక్షణ సమితి (పి.పి.ఎస్) అధ్యక్షుడు టి.ఎల్. నరసింహులును మున్సిపాలిటీ "స్వచ్ఛ సర్వేక్షణ్ బ్రాండ్ అంబాసిడర్"గా నియమించింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో పి.పి.ఎస్, ఎన్జీఓ సంఘం ప్రతినిధులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మాన అనంతరం టి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ... పట్టణంలో పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులతో సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేస్తానన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పలమనేరు పరిరక్షణ సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన స్థానిక శాసనసభ్యులు ఎన్. అమరనాథ రెడ్డి కి, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ (ఆర్.డి.ఓ) మరియు మున్సిపల్ కమిషనర్ కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నరసింహులు నియామకం పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, పి.పి.ఎస్ ప్రధాన కార్యదర్శి వి. నారాయణ ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో ప్రజల హితం కోరి మరిన్ని మంచి కార్యక్రమాలు జరగాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రామచంద్ర, సన్నీ రాజు, రాఘవయ్య, శ్రీపురం సీతారామయ్య, పొన్ముడి, రెడ్డెప్ప నాయుడు, నాగప్ప, జగన్నాథ్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, దొరస్వామి, సాంబయ్య, వీరభద్ర గౌడు తదితరులు పాల్గొన్నారు.



## పులిగుండు ప్రాంతాన్ని పర్యాట కేంద్రాల అభివృద్ధికి కృషి చేసిన ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం విప్ డాక్టర్ విఎం థామస్

కార్వేటినగరం ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): పెనుమూరు మండలం, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని పులిగుండు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయుటకు 79.03 ఎకరాల భూమిని కేటాయించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా పులిగుండు ప్రాంతం రాష్ట్ర పర్యాటక పటంలో ప్రత్యేక స్థానం సంపాదించడంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతీయ ఆర్థిక పురోగతికి ఎంతో దోహదపడుతుంది. ప్రకృతి సౌందర్యంతో ప్రసిద్ధి చెందిన పులిగుండు ప్రాంతం అభివృద్ధి చెందడం గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు గర్వకారణం. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన గౌరవ ముఖ్యమంత్రికి, డిప్యూటీ సీఎంకి, మంత్రి నారా లోకేష్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి నియోజకవర్గ ప్రజల తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రభుత్వం విప్ డాక్టర్ థామస్.



## చురుగ్గా మై టిడిపి ఆప్ వాడకం పట్ల అభినందనలు



కుప్పం,ఏప్రిల్11 (జనసంఘర్షణ): మై టిడిపి ఆప్ చురుగ్గా ఉపయోగిస్తున్నందుకు జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ప్రశంసా పత్రం పంపారు. కుప్పం నియోజకవర్గం కుప్పం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుకు చెందిన శ్యాంసుందర్‌కు టిడిపి అధిష్టానం ఈ ప్రశాంతి పత్రాన్ని పంపింది. ఈ ప్రశంసాపత్రాన్ని ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శ్యాంసుందర్ కు అందజేసి అభినందించారు.

## కుప్పంలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

◆ పర్యావరణానికి హాని కలిగించే సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడకండి.

◆ పట్టుబడితే అమ్మిన వాడిన వారికి పెనాల్టీలు విధిస్తాం.




కుప్పం,ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): కుప్పం మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు శనివారం మున్సిపల్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని ఆయన దుకాణదారులకు విజ్ఞప్తి చేశారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ అమ్మిన, వాడిన వారికి కూడా పెనాల్టీలు విధిస్తామని హెచ్చరించారు. దుకాణాల్లో, కాయగూరల షాపులలో, హోటల్లో మున్సిపల్ కమిషనర్, సానిటరీ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ ఇకనుండి ఇటువంటి ప్లాస్టిక్‌ను అమ్మిన వారికి, వాడిన వారికి పెనాల్టీ వేయడం జరుగుతుందని ప్రజలు దయచేసి ప్లాస్టిక్ వాడరాదని తెలియజేశారు. ముఖ్యంగా హోటల్ వారు ప్లాస్టిక్ వేసి ఇడ్లీ ఉడికించరాదని, కాయగూరల షాపుల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కాకుండా బయోడిగ్రేడబుల్ కవర్లు మాత్రమే వాడాలని, ఇకనుండి ప్రతిరోజు మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తారని ప్రజలు, దుకాణదారులు దయచేసి సహకరించాలని తెలియజేశారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా కుప్పం రూరల్ మండలం

◆ పార్టీ అధ్యక్షులు రాజగోపాల్‌ను అభినందించిన టిడిపి నేతలు

కుప్పం,ఏప్రిల్ 11 (జనసంఘర్షణ):



చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను ,ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కుప్పం రూరల్ మండలం ముందంజలో వుంది. దీంట్లో ఇటీవల విజయవాడలో ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షులు రాజగోపాల్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. స్థానిక బైపాస్ రోడ్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశం సందర్భంగా రాజగోపాల్‌ను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పార్టీ ఇంచార్జ్ మునిరత్నం, టిడిపి ప్రధాన నాయకులు సురేష్ బాబు, ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతి రావు పూలేకి జయంతి నివాళులు.. బిజెపి నేతలు



శ్రీకాళహస్తి ఏప్రిల్ 11 (జనసంఘర్షణ): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సూచనల మేరకు మహాత్మ జ్యోతిరావు పూలేకి శ్రీకాళహస్తి పట్టణం లోని పాత బస్టాండ్ సర్కిల్ దగ్గర ఆ మహానుభావునికి నివాళులు అర్పించడం జరిగనది. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్ మాట్లాడుతూ.. 1827సంవత్సరం మహారాష్ట్ర సతాలి జిల్లా నందు పూల వ్యాపారం కుటుంబంలో జన్మించి గొప్ప సామాజిక సంస్కర్త, విద్యా వేత్త అయిన పూలే భారత స్వాతంత్రానంతరం ఆ రోజుల్లో ఉన్న కుల వివక్ష, అంటరాని తనం లింగ వివక్ష కు వ్యతిరేకంగా పోరాడి, బాలిలకు విద్య అవసరమని తన సతీమణి సావిత్రి బాయి పూలే తో కలిసిమొదటగా మహిళలకు విద్యాలయం స్థాపించిన గొప్ప వ్యక్తి అని, మహిళలు పురుషులతో సమానమని లింగ వివక్ష చూపకూడదని, దళిత బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషిచేసిన చిరస్మరణీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల కోసం దళిత అనే పదాన్ని వాడారు. అయన చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా 1888 సంవత్సరములో మహాత్మాఅనే బిరుదుని ప్రదానం చేశారు. గులాం గిరి, రైతు వాగ్దానం రచనల ద్వారా సమాజంలోని అన్యాయాలను ఎండ గట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేళా గారం సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండేటి గోపాల్, సీనియర్ నాయకులు గరికపాటి రమేష్ బాబు, జీవీ అమర్నాథ్, కన్నా వెంకటేశ్వర్లు, పట్టణ దళిత మోర్చా అధ్యక్షులు గాదెపాకుల యతీష్, యశ్వంత్, పునీత్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిఎం కార్యాలయంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**:- ముఖ్యఅతిథిగా ఆర్జి 1 ఏరియా ఇంచార్జి జి.యం కె.చంద్రశేఖర్**



**గోదావరిఖని,ఏప్రిల్ 11 జనసంఘర్షణ**

శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకల సందర్భంగా ఆర్జీ.1 ఏరియా జియం కార్యలయ సమావేశాహాలు నందు మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ.1 ఏరియా ఇంచార్జి జి.యం కె.చంద్రశేఖర్ హాజరై కేక్ కట్ చేసి,మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు మరియు పుష్పాలు వేసి నివాళులు అర్పించారు. ఆలాగే బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అద్వర్యంలో ఆర్జీ.1 ఏరియాలోని అన్ని జిడికె,1&3 2&2ఎ,11 ఇంక్లైన్ గనులు ఓసి-5 మరియు అన్ని డిపార్ట్ మెంట్ లలో మహాత్మా జ్యోతీబా పూలె జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త,ఉద్యమకారుడు, సంఘసేవకుడటైన జ్యోతీబా పూలే గోవిందరావ్ పూలే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలోని మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడని,వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పూలే గారు చేసిన కృషిని స్పూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులు ఐఖ్యంగా ఉండాలని తెలిపారు.జ్యోతీబా పూలే చేసిన సామాజిక సేవకు గుర్తుగా ప్రజలు ఈయనను 'మహాత్మా' అని పిలుచుకుంటారని అప్పట్లో అణగారిన వర్గాలకు,మహిళలకు చదువు అందేది కాదు.విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆయన నమ్మారు.1848లో పుణేలో బాలికల కోసం భారతదేశంలోనే మొదటి పాఠశాలను ప్రారంభించారు.తన భార్య సావిత్రీబాయిని చదివించి, ఆమెను దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు.జ్యోతిభా పూలే కేవలం మాటలకే పరిమితం కాకుండా,సమాజంలో అంటరానితనం తొలగించడానికి తన ఇంట్లోని మంచి నీళ్ల ట్యాంకును కూడా అందరికీ అందుబాటులోకి తెచ్చారని మరియు బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులకు జ్యోతిభా పూలే ఒక గొప్ప ప్రేరణ.తను 1890,నవంబర్ 28న ఆయన మరణించినా,ఆయన ఆశయాలు నేటికీ ఎంతో మందికి మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్జీ.1 ఏరియా ఇంచార్జి జి.యం కె.చంద్రశేఖర్,విశిష్ట అతిథిగా ఆర్జీ రీజియన్ క్వాలిటి జియం సుజోయ్ మజుందర్,బిసి లైజన్ అధికారి పెరుమాళ్ళ శ్రీనివాస్,ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య,బిసి & ఓబిసి సెక్రటరి బత్తుల పోషం,ఏజంట్ చిలుక శ్రీనివాస్,ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ఓసి.5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్,పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు దేవులపల్లి రాజేందర్,పెంచాలా తిరుపతి,దీటి చంద్రమౌళి,అధికారుల సంఘం ప్రతినిధి కోలా మల్లేష్, డివై.పియం నాగుల వేణు,జియం ఆఫీస్ ఎఐటియుసి ప్రతినిధి ఇజ్జగిరి రాజు, సీనియర్ పిఓ శ్రావణ్ కుమార్,పిఓఏ పూట్ల దేవాచారి మరియు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఖనిలో బ్రహ్మ కమలం వికసించింది

**:- హిమాలయాల్లో పెరిగే అసలైన బ్రహ్మ కమలం.ఇంట్లో వికసించింది.**

**:- రాజలక్ష్మి కాలనీలో వెలసిన 'నైట్ క్వీన్'**



**గోదావరిఖని,ఏప్రిల్ 11 జనసంఘర్షణ :-**

బ్రహ్మ దేవుడు ఈ పువ్వులో నివసిస్తాడని,ఇది వికసించడం చూసినవారికి కోరికలు నెరవేరతాయని హిందువుల విశ్వాసం.చాలా అరుదుగా కనిపిస్తుంది కాబట్టి శుభశకునంగా భావిస్తారు.అరుదైన బ్రహ్మ కమలం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని రాజలక్ష్మి కాలనీలో నివాసం ఉండే మొగిలి మంగ రాజేష్ ఇంట్లో వికసించింది.సంవత్సరానికి ఒక్కసారి,అదీ అర్ధరాత్రి మాత్రమే విచ్చుకునే ఈ ఫ్లవర్ శుక్రవారం అర్ధరాత్రి వికసించింది.దీంతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.ఈ పువ్వును చూసేందుకు స్థానికులు పోటెత్తారు."ఈ అరుదైన బ్రహ్మ కమలం.శుక్రవారం రాత్రి 8గంటలకు మొగ్గ విచ్చుకోవడం ప్రారంభించి.12గంటలకు పూర్తిగా వికసించింది.సుమారు 8 అంగుళాల వెడల్పుతో,ఘాటైన సువాసనతో అందరినీ ఆకట్టుకుంది."బ్రహ్మ కమలం కేవలం 4 నుండి 5 గంటలు మాత్రమే వికసించి ఉంది. తెల్లవారేసరికి మూసుకుపోయింది.అందుకే దీన్ని చూడడం అదృష్టంగా భావిస్తారు.హిమాలయాల్లో 4500 మీటర్ల ఎత్తులో సహజంగా పెరిగే ఈ పువ్వును ఇప్పుడు నగరాల్లో కూడా పెంచుతున్నారు."రాజ్యలక్ష్మి కాలనీలో బ్రహ్మ కమలం వికసించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ ఏడాది శుభ సూచకమని అభిప్రాయపడ్డారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయసాధనాలను కొనసాగిద్దాం

**- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్**



**మక్తల్,ఏప్రిల్ 11 జనసంఘర్షణ**

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనాలను ప్రతి ఒక్కరు కొనసాగించవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మార్కెట్ చైర్మన్ పి నరసింహ గౌడ్ అన్నారు.స్థానిక అంబే ద్కర్ భవనంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం అంబేద్కర్ సంఘం, పూలే సంఘం అధ్యక్షులు కురు మయ్య జుట్ల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వేడుకల్లో పాల్గొన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం వేళ్లూ పాకి పోయిన రోజుల్లోనే విద్యతోనే మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆనాడు చదువు అందని స్థితిలో ఉన్న తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి, మహిళా సాధికారతకు బాటలు వేశారని, స్త్రీలు పురుషులతో సమానమని చాటిచెప్పారని గుర్తు చేశారు. బహుజన చైతన్యంతో పూలే ఆలోచనా విధానాలను నేటికీ బహుజన సమాజం ఆచరిస్తోందని, ఆయన ఆశయాల వల్లనే నేడు సామాన్యులకు విద్య, గౌరవం దక్కుతున్నాయని అన్నారు.తరాలు గడిచినా పూలే చరిత్ర నేటికీ శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తున్నారంటే అది ఆయన గొప్పతనమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు వల్లంపల్లి లక్ష్మణ్ ప్రజా సంఘాల నాయకులు జె ఎన్ ఎస్ నరసింహ అమాలి జట్ల రాములు ఏ హనుమంతు దండు రాము ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.





**దౌల్తాబాద్ ఏప్రిల్ 11 జనసంఘర్షణ**

దౌల్తాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపాల్ సప్నతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం ప్రారంభంలో పూలే జీవితం, ఆయన చేసిన సమాజ సేవలను స్మరించుకుంటూ మౌన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సప్న మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సమానత్వం, మహిళా విద్య, దళితుల అభ్యున్నతికి చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వరాలకు విద్య అందించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రతి విద్యార్థి పూలే ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. పూలే చూపిన మార్గం సమాజానికి మార్గదర్శకమని, ఆయన స్పూర్తితో సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పూలే జీవితం, ఆయన చేసిన సంస్కరణలపై వివరణాత్మకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**నర్వ ఏప్రిల్ 11: జనసంఘర్షణ**



నర్వ మండల పరిధిలోని రాయికోడ్ అంబేద్కర్ యువజన సంఘం ఆద్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అద్యక్షులు మల్లన్ కోటి శంకర్ ఆద్వర్యంలో గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,ప్రజా ప్రతినిధులు,నాయకులతో కలిసి గ్రామంలోని పూలే చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావుపూలే,సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలేసమాజంలో సమానత్వం,విద్యా విస్తరణ,మహిళా సాధికారత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు.ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.సమాజంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఆయన ఆశయమని గుర్తుచేశారు. రవి కుమార్,నౌసు వెంకటయ్య,టెన్ట్ హౌస్ ఖాజా మైనోద్దీన్,నర్వ శేఖర్ యాదవ్,వార్డు సభ్యులు నౌసు నర్సింహులు,మ్యాతరి చెన్నప్ప,రామాంజనేయులు గౌడ్,యువకులు గడ్డమీది భీమేష్,కే రాములు గౌడ్,గొల్ల కురుమూర్తి,గిరపుగారి నరసింహా,పి భీమెష్,పురుషోత్తం మేస్త్రి,యం ఆనంద్ మేస్త్రి,జీన్రాల చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**గోదావరిఖని,ఏప్రిల్ 11 జనసంఘర్షణ**

రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వారి సతీమణి మనాలి ఠాకూర్ శనివారం రాజేష్ టాకీస్ సమీపంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగరపాలక సంస్థ మేయర్,డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లు,కాంగ్రెస్ కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# షామీర్పేట్లో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం




**మేడ్చల్ ఏప్రిల్ 11**

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా షామీర్పేట్లో అఖిల భారత కిసాన్ సభ 91వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రాంతి భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి. జంగయ్య యాదవ్ జెండా ఎగురవేసి సభను ప్రారంభించారు. 1936 ఏప్రిల్ 11న స్థాపించబడిన కిసాన్ సభ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లో జెండా ఆవిష్కరణలు, సమావేశాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డి.జి. నరేందర్ ప్రసాద్ మాట్లాడుతూ, రైతాంగ ఉద్యమాలకు పునాది వేసిన మహనీయులను స్మరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రధాన డిమాండ్లు: పంటలకు గ్యారెంటీ మద్దతు ధర, రుణమాఫీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక సమస్యలలో భాగంగా షామీర్పేట్లో భూమి వివాదాలు, నష్టపరిహారం చెల్లింపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 13న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, స్థానిక రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు డి.జి.సాయిలు గౌడ్, జిల్లా అధ్యక్షులు డి. జంగయ్య, జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ , జిల్లా కోశాధికారి గ్రా. చంద్రయ్య ,వీ. కొండయ్య్. వెంకటేష్, పెరుమాళ్ళ నరసింహ. స్థానిక రైతు సంఘం నాయకులు సి. హెచ్. దర్శన్ , మహమ్మద్ నిస్సార్ ఖాన్, దొంతర పోయిన భూమయ్య, గొలుసుల మల్లయ్య, గడీల బాలయ్య, దండు మల్లేష్, రైతు కూలీలు, తదితరులు పాల్గొన్నారు

# జ్యోతిబా పూలే 200వ జయంతి ఘనంగా నిర్వహణ






**జగద్గిరిగుట్ట ఏప్రిల్ 11**

జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయం వద్ద సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే గారి 200వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, బీసీ మరియు ఎస్సీ ఉపకులాల సంఘాల ప్రతినిధులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చదువు అందించే దిశగా మొదటి అడుగు వేసింది మహాత్మ జ్యోతిబాపూలేనని తెలిపారు. 200 సంవత్సరాల క్రితం దేశంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలకు మాత్రమే విద్య హక్కు ఉండగా, ఇతర కులాలకు చదువు నిషేధించబడిందని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో సాధారణ కుటుంబంలో జన్మించిన పూలే, విద్యను అభ్యసించి ముందుగా తన భార్య సావిత్రిబాయి పూలే గారికి బోధించి, తరువాత సమాజంలోని అన్ని వర్గాల వారికి విద్య అందించేందుకు కృషి చేశారని కొనియాడారు. ఈ క్రమంలో పూలే దంపతులు దేశంలోని మొదటి ఉపాధ్యాయులుగా నిలిచారని పేర్కొన్నారు. అలాగే బి. ఆర్. అంబేద్కర్ గారు కూడా పూలేను తన గురువుగా భావించారని, వారి కృషి అపారమని అన్నారు. యువత చరిత్రను సరిగ్గా తెలుసుకొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, కుల, మత రాజకీయాలకు లోనుకాకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శి హరినాథ్, ఎన్ఎస్యూఐ మాజీ కార్యదర్శి సాయి పంతుల, దళిత సంఘం నాయకులు డప్పు రామస్వామి, తొండ వెంకట, కళాకారుడు మా పల్లె శంకర్, మహిళా సంఘం అధ్యక్షురాలు హైమావతి, రజక సంఘం నాయకులు విటల్, రాజు, సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాస్ చారి, నగేష్ చారి, యాదవ సంఘం సత్యనారాయణ, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, జానకిరామ్, నాయి బ్రాహ్మణ నరసింహ, ముదిరాజ్ సంఘం నాయకులు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, యువజన నాయకులు కీర్తి, సిపిఐ నాయకులు ఇమామ్, నరసయ్య, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు



**సైబరాబాద్ ఏప్రిల్ 11**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలో మహాత్మా జ్యోతిరావు పూలే గారి 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, సమాజంలోని పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలను కొనియాడారు. విద్యా విస్తరణ, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఉమ్మడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జవహర్ నగర్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ





జవహర్ నగర్లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మారోజు సోమచారి ఆధ్వర్యంలో నిర్వహించగా, పలువురు ప్రముఖులు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు మారోజు సోమాచారి మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వ సమాజ నిర్మాణంలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అలాగే జవహర్ నగర్లో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేసి, బీసీలంతా ఐక్యతతో ఉంటూ ఏ సమస్యలు వచ్చినా స్థానికంగానే పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ సమాజం మరింత బలపడాలంటే ఐక్యత అత్యంత ముఖ్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్, రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు మహంకాళి బిక్షపతి, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, వడ్డెర సంఘ అధ్యక్షులు నర్ర మహేష్, మాజీ మేయర్లు మేకల కావ్య, శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉషార్పల్లి-సికింద్రాబాద్కు కొత్త బస్ సర్వీస్ ప్రారంభం






హకీంపేట్ బస్ డిపో ఆధ్వర్యంలో ఉషార్పల్లి నుండి సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన సర్వీస్ నెంబర్ 120 బస్సును జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ్, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కొత్త బస్సు సర్వీస్ ప్రారంభం ద్వారా ఉషార్పల్లి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఉద్యోగ, విద్య, వైద్య అవసరాల కోసం సికింద్రాబాద్కు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ఎంతో అవసరమని, ఈ బస్సు సేవ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల కౌన్సిలర్లు దోసకాయల లత వెంకటేష్, పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్ రెడ్డి, రాజిగళ్ళ లత భూపాల్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేమురి విష్ణు గౌడ్, నాయకులు నల్ల ప్రభాకర్ రెడ్డి, తుంకి వెంకటేశం, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, కొండల్ రెడ్డి, నాగిరెడ్డి పెంటారెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిడ్డ మంత్రి అయితే ఓర్వలేక పోతున్నారు

**- మండిపడ్డ ఆల్ మేవా వ్యవస్థాపక అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఫరూక్ హుస్సేన్**

**నారాయణపేట, ఏప్రిల్ 11**

కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల పాటు కార్యకర్త స్థాయి నుంచి మంత్రి పదవికి ఎదిగిన మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పదవిచేపట్టినాటి నుండి నేటి వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆయనపై నిందలు వేస్తున్నారని ఆల్ మే వా వ్యవస్థాపక అధ్యక్షులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన షేక్ ఫరూక్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకిటి శ్రీహరి ప్రారంభోత్సవం చేసిన కార్యక్రమాలకి మళ్లీ శంకుస్థాపన చేసి పైగా శ్రీహరి పై అవాకులు చెవాకులు మాట్లాడడం ఢీకే ఆరుణ కే చెల్లిందన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co